
# ఇంక్‌లెస్ పెన్స్



వి. వి. యస్ రామచంద్రమూర్తి

**శం**కరం పక్కసీటే రామారావుది. వాళ్ళిద్దరూ ఒకే ఆఫీసులో గుమాస్తాలు. వాళ్ళని స్నేహితులనడం కంటె కొలీగ్స్ అంటేనే సబబేమో!

ఎంచేతంటే వాళ్ళిద్దరికీ, ఒకరిమీద మరొకరికి అనుమానం — బాస్ చేత మంచివాడనిపించుకోవాలని అవతలివాడు ట్రై చేస్తున్నాడేమోనని! ఇద్దరూ ఇంచుమించు ఒకేసారి ఉద్యోగంలో చేరారు. ఇద్దరికీ ఒకటే క్వాలిఫికేషన్స్.

వాళ్ళిద్దరూ స్నేహితులు కాకపోయినా పైకి నవ్వుతూ, ఆఫీసులో కాలక్షేపం చేసేందుకు ఏదోఒకటి మాట్లాడుకుంటుంటారు.

ఏదో ఫైలు చూస్తున్నవాడల్లా ఆగి! శంకరం, ''చూశారా, రామారావుగారూ, నే నిన్నాళ్ళా ఏమిటో అనుకున్నాను గాని, మా అమ్మాయిని, అల్లుణ్ణీ నిన్న ఈ మైకా కేసులో పెట్టడం మరచిపోయి ఇంటికెళ్ళిపోయానండి. అంతే, మా ఆవిడ ఎక్కడికో ఊరుకెళ్ళవలసి వచ్చింది. వీటికి ఎడబాటు కలిగించి నందువల్ల మా దంపతులకు కూడ ఎడబాటు కలిగింది'' అన్నాడు రామారావుతో.

వాస్తవానికి, శంకరానికి పెళ్ళయితే అయింది కాని, ఇంకా పిల్లలెవరూ లేరు. మరయితే ఏదో అమ్మాయి, అల్లుడు అంటున్నాడు, కొద్దిగా స్క్రూలూజు కాని కాదు కదా, అంటే అదీకాదు. అతను అమ్మాయి, అల్లుడు అని అంటున్నవి అతనికి వాళ్ళ సంస్థ ఇచ్చిన రెండు బాల్ పెన్నులు. అందులో ఒకటి రెడ్డింకుది — మరొకటి బ్లాకింకుది. రెడ్డింకు దాన్ని, తన కూతురుగానూ, బ్లాకింకు దాన్ని తన అల్లుడుగానూ వ్యవహరిస్తూ, ప్రతిరోజూ ఆఫీసు విడిచి వెళ్ళిపోయే ముందు వాటికి సంబంధించిన మైకా కేసులో రెండూ పెట్టేసి 'జాగ్రత్తగా పడుకోండి' అని చెప్పి వెళ్ళిపోతుంటాడు.

శంకరం మాటలు విన్న రామారావుకు నవ్వాగింది కాదు. కాస్సేపు నవ్వి, ''మీరు భలేవారే! పెన్నులు రెండూ విడదీసి నంతమాత్రాన, మీకు ఎడబాటు రావట మేమిటండీ?'' అన్నాడు.

''మీ రట్లా వేళాకోళంగా తీసుకోకండి సార్! నేను నిజంగానే చెబుతున్నాను. ఇట్లా ఇదివరకు రెండు, మూడు సార్లు జరిగినది అబ్జర్వ్‌చేసే చెపుతున్నాను. ఒకసారయితే ఆరోజు మా ఆవిడ బర్త్‌డే. ఆవిణ్ణి ఏదేని సినిమాకు తీసుకెళ్ళి, రాత్రంతా సరదాగ్గా గడపాలనుకుని, ఆ హడావిడిలో మా అమ్మాయిని, అల్లుణ్ణీ, ఒకచోట పెట్టటం మరచి వెళ్ళిపోయా. అంతే—ఎవరో చుట్టాలొచ్చారు ఆ వాళ మా యింటికి. ఇంక సినిమాలేదూ—సరదాలేదు! నేనివ్వన్నీ అబ్జర్వ్‌చేశానుకాబట్టే ఇంత నిక్కచ్చిగా చెబుతున్నా!'' అన్నాడు శంకరం కొద్ది సీరియస్‌గా

''మీరెన్నేనా చెప్పండి, నేను మాత్రం నమ్మను. ఆ పెన్నులేమైనా జీవంవున్న వస్తువులా ఏమిటి, విడదీస్తే బాధపడ్డానికి?'' అన్నాడు రామారావు.

''మీరు నమ్మితే నమ్మండి, లేకపోతే లేదు. కాని జరుగుతున్నది మాత్రం అట్లాగే'' అన్నాడు శంకరం.

'ఏమో, నమ్మలేను' అన్నట్లుగా పోజు పెట్టి, రామారావు తన పనిలో మునిగిపోయాడు.

కొంచెం సేపయిన తరువాత శంకరం కూడ పనిలో పడిపోయాడు

ఆఫీసు ప్యూను కోటయ్య వచ్చి అందరి దగ్గర డబ్బులు వసూలు చేసి, అందరికీ టీ తీసుకువచ్చి యిచ్చాడు.

శంకరం, రామారావు టీ లు త్రాగుతూ మళ్ళీ బాతాఖానీలో పడ్డారు.

# ఇంక్‌లెస్ పెన్స్

'ఏంటిసార్. విశేషాలు ?'' అడిగాడు శంకరం, రామారావుని.

''విశేషాలేముంటాయి! అవునుకాని. మీరు నిన్న రిలీజయిన 'ఆదర్శ దంపతులు' సినిమా చూశారా?''అడిగాడు రామారావు.

''లేదండి !''అన్నాడు శంకరం.

ఎందుకో అటుగా వెళ్తున్న వాళ్లబాస్, వాళ్ల సంభాషణలు విని, ''శంకరంగారు 'ఆదర్శ దంపతులు' సినిమా చూడ్డ మెందు కండి రామారావుగారూ ! వాళ్ల దంపతులే నిజంగా ఒక ఆదర్శ దంపతులు. అంచేత ఇంక వేరేగా సినిమా చూసి నేర్చుకునేదే ముంటుంది ?'' అన్నాడు.

శంకరం నెమ్మదిగా నవ్వుతూ, ''థాంక్స్ సర్!'' అన్నాడు.

రామారావు లేని నవ్వు ముఖం మీదకు తెచ్చుకుంటూ, ''కరెక్టుగా చెప్పారు సార్.'' అన్నాడు వాళ్ల బాస్‌తో.

బాస్ నవ్వుకుంటూ లోపలకు వెళ్లి పోయాడు.

టీ త్రాగటం ముగించి, శంకరం, రామారావు మళ్లీ పనిలో పడిపోయారు. కాని శంకరం మనసు మాత్రం తన భార్య అరుణ మీదకు మళ్లింది 'నిజంగా అరుణ లాటి ఆడది తనకు భార్యగా లభించటం తను ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో ! తమ జంటను చూచి చాలమంది ముచ్చట పడతారు. ఒకసారి తమ బాస్ అయితే, ''మీరు విల్స్ వాళ్ల 'మేడ్‌ఫర్ ఈచదర్' కంటెస్ట్‌కు వెళ్లండి ! తప్పకుండా మీ జంటకు ప్రయిజు వస్తుంది !'' అన్నాడు. కాని తనకు సిగరెట్టు కాల్చడమే తెలియదు. ఇంక స్టైలిష్‌గా ఏమి కాలుస్తాడు. ఏమి ప్రయిజు వస్తుంది అని ఊరుకున్నాడు. తమ బాస్ దగ్గరున్న మంచి గుణం అదే — చెడయినా, మంచయినా మనసులో ఉన్నది పైకి అనేస్తాడు. తనకు అరుణతో పెళ్లయినప్పట్నించి ఏవరేజిన రోజుకొకసారేనా అన్నాడు తమ బాస్, ''మీ ఇద్దరు ఒకళ్ల కోసం ఒకరు పుట్టా రండి !'' అని.

'లంచ్ అవర్ వచ్చేదాకా అట్లా ఆలో చిస్తూనే ఉన్నాడు శంకరం.

''ఏం గురూగారూ! లంచ్‌కి పోదామా?'' అంటూ పిలిచిన రామారావు పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు శంకరం.

శంకరం, రామారావు ఒక వీధిలోనే రెండు, మూడిళ్ల తేడాలో ఉంటున్నారు. అంచేత లంచ్‌కు పోయేటప్పుడు కలిసే వెళు తూంటారు.

''ఇవాళ ఇంటిదగ్గర నా వైఫ్ లేదుగా ! అంచేత ఇవాళ్టికి హోటల్లోనే కానిచ్చేస్తా న్లెండి ! మీ రెళ్లండి!'' అన్నాడు శంకరం.

''ఓ – అన్నట్లు ఇందాకా చెప్పారుగా— 'ఎడబాట్లు' వచ్చాయని. అయితే నే వస్తా మరి !'' అంటూ ఇంటికి బయలుదేరాడు రామారావు.

రామారావుకు కూడ పెళ్లయి రెండేళ్లవు తుంది. తమజంటకూడ 'చిలకా గోరింక'ల్లా ఉంటే బాగుండునని రామారావు చాల సార్లు అనుకుంటూంటాడు.

రామారావు ఇంట్లోకి ప్రవేశించేటప్పటికి



అతని భార్య రుక్మిణి మంచం మీద పడుకుని ఏదో పత్రిక తిరగేస్తోంది. పుస్తకంలోంచి తల తిప్పి, "వచ్చారా? ఇవాళ ఒంట్లో కొద్ది బద్ధకంగా ఉండి టిఫిన్ ఏమీ చెయ్యలేదండి. ప్లీజ్! కొద్దిగా కాఫీ పెట్టి నాక్కూడ ఇవ్వండి!" అంది.

ఇట్లాంటి మాటలు వినడం రామారావుకు కొత్తకాదు. అసలు ఇంటికి రావడంకన్న ఏ హోటల్లోనో టిఫిను చేసేస్తే బాగుంటుందని రామారావుకు తెలుసు. కాని, ఇంటిదగ్గర పెళ్ళాం ఉండికూడ లంచ్‌కు ఇంటికి పోవటం లేదంటే కొలీగ్స్, ఊర్లో వాళ్ళు ఏదైనా అనుకుంటారేమోనని వస్తున్నాడు.

చొక్కా తీసి హేంగర్‌కు తగిలించి, వంట గదిలోకి వెళ్ళి స్టౌ వెలిగించబోయాడు, కాని అది అంటుకోలేదు — ఎంతసేపు ప్రయత్నించినా. స్టౌ కదిపి చూశాను—కిరసనాయిలు ఉన్నట్లు లేదు.

"రుక్కూ!" పిల్చాడు తన భార్యను.

"దేనికండీ?" అంది రుక్మిణి అవతలి గదిలోంచి.

"ఇందులో కిరసనాయిలు అయిపోయినట్లుంది—కొద్దిగా పోస్తావా?" అన్నాడు రామారావు.

"అబ్బ! కథ మంచిపట్టులో ఉందండీ! మీరే కానిచ్చేదురూ!" అందిరుక్మిణి అవతలి గదిలోంచే.

"ఛ! ఛ! వెధవకొంప!" అని విసుక్కుంటూ స్టౌలో కిరసనాయిలు పోసి వెలిగించాడు రామారావు.

ఎట్లాగో కష్టపడి, నాలుగుసార్లు చేతులు కాల్చుకుని, అయిదు సార్లు 'ఛ! వెధవకొంప!' అనుకొని, కాఫీ చేయటం ముగించి, "కాఫీ తయారయింది—ఇటు తగలడు!" అంటూ పిలిచాడు రుక్మిణిని.

"ప్లీజ్! ఓ కప్పుతో ఇటుతిస్కురండి!" అంది రుక్మిణి.

రామారావుకు ఏం చేయాలో బోధపడటం లేదు. కొద్దిసేపు ఆలోచించి రెండుకప్పులలో కాఫీ తీసుకుని, అవతలిగదిలోకి వెళ్ళి తన భార్యకు ఒకటిచ్చి, తను ఒకటి తీసుకుంటూ, రుక్మిణి పడుకున్నమంచంమీదకూర్చున్నాడు.


కొద్దిగా పక్కకు జరుగుతూ, "ఏమిటీ— ఇవాళ ఇంక ఆఫీసుకెళ్లరా ఏం?" అంది రుక్మిణి చిన్నగా, చిలిపిగా నవ్వుతూ.

"అదికాదు రుక్కూ! నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి!" అన్నాడు రామారావు నెమ్మదిగా.

"అయితే రెండునిముషాలాగండి! ఈకథ పూర్తి చేసింతర్వాత తాపీగా మాట్లాడుకుందాం!" అంది రుక్మిణి, కాఫీతాగి కప్పు అతని చేతికిస్తూ.

ఇంచుమించు ప్రతిరోజూ జరిగే పనే అయినా, రామారావుకు మతిపోతున్నట్లుంది.

కథ చదవడం ముగించి, పుస్తకం మూసేస్తూ, "ఊఁ! ఇప్పుడు చెప్పండి — ఏమిటో ఆ ముఖ్య విషయం?" కొద్దిగా



మమ్మల్ని గుర్తుపట్టలేకపోతే మాత్రం ఇలా నెంబర్లెయ్యటం ఏం బాలేదుఫాదర్...

ఎగతాళి మిళితమయిన స్వరంతో అడిగింది రుక్మిణి.

"నువ్విది వేళాకోళంగా తీసుకోకు రుక్కూ! నేను సీరియస్‌గా చెబుతున్నాను. ఆ శంకరం వాళ్ళ దంపతులను మా బాస్ ప్రతిరోజూ,'మేడ్‌ఫర్ ఈచదర్' అని, 'ఆదర్శ దంపతుల'ని అంటూంటాడు. మనం కూడ అట్లా అనిపించుకోవాలని నా ఉద్దేశం." అన్నాడు రామారావు.

"బాగుందండీ! దీనికా ఇంత పోజు! మొగుడూ పెళ్ళాలన్నాక ఏదో సర్దుకుపోవాలి కాని, ఇప్పుడు మనకొచ్చిన లోటేమిటి?" అంది రుక్మిణి, అతని గుండెలమీద చేతులేసి బనీను సర్దుతూ.

"అదికాదు రుక్కూ! మా ఆఫీసులో ఇంతమంది ఉన్నాంకదా! వేరొకళ్ల నెవర్నైనా అట్లా అనచ్చు కదా! ఆ వెధవ శంకరం గాడ్నే ఎందుకనాలి మా బాస్ అని? అందుకే వాడికి మహాగొప్ప! వాడికది లేకుండా చేయాలనే నా ఆరాటం!" అన్నాడు రామారావు.

"ఇదిగో చూడండి! ఎవళ్లో అనుకోవాలని, మనం ఏ పనీ చేయలేము. మనకు చాతనయినట్లు మనం బ్రతుకుదాం!" అంది రుక్మిణి, ప్రక్కన పడేసిన మాగజైన్ మళ్ళీ అందుకుంటూ.

'ఇంక లాభంలేదు!' అనుకుంటూ రామారావు చొక్కా వేసుకుని ఆఫీసుకు బయలుదేరాడు.

"ఏమిటి రామారావుగారూ! ఇవాళ ప్రతిరోజు కంటే లేటుచేసేశారు!" అంటూ పలకరించాడు శంకరం, రామారావు ఆఫీసులోకి వస్తూండగానే.

"ఆఁ! ఏముంది?" అని లేనినవ్వునవ్వుతూ వెళ్లి తన సీట్లో కూర్చున్నాడు రామారావు.

'ఇంటిదగ్గర చెప్పినట్లు వినేభార్య వుంది కాబట్టి, ఈ వెధవ శంకరంగాడు టైముకు వస్తూంటాడు. దానికోసం పెద్దగర్వం!' అనుకున్నాడు లోపల రామారావు.

పనైతే ఏదో చేస్తున్నాడు కాని, మనసు మాత్రం మండిపోతోంది రామారావుకు. "ఈవెధవశంకరం వాళ్లనే'ఆదర్శదంపతుల'ని తమ బాస్ ఎందుకనాలి?" ఇదే ఆలోచన అతన్ని తినేస్తోంది.

సాయంత్రం టైమవుతూనే శంకరం సీటులోంచి లేచి, "ఇంటికి వస్తారా రామారావుగారూ!" అని అడిగాడు.

"లేదండి! ఈ ఫైలు గొడవేదో ఈవాళే చూసేయమన్నాడు బాస్. అంచేత కొంచెం లేటవుతుంది. మీరెళ్లండి!" అన్నాడు రామారావు.

"ఓకే! గుడ్‌నైట్!" అంటూ శంకరం ఆఫీసు బయటకు నడిచాడు.

* * *

మర్నాడు ఉదయం సీట్లో కూర్చుని, తన డ్రాయరు సొరుగు తీసిన శంకరం ఆశ్చర్యపోయాడు—తన రెడ్డింకు, బ్లాకింకు బాల్ పెన్స్, అని పెట్టుకొనే మైకా కేసు పగిలిపోయి ఉన్నాయి!

రామారావింకా ఆఫీసుకు రాలేదు!